**కథ**

# ఓ కోడలి స్వగతం

**సి.వి.నరసింహాదాసు**

**కొత్తకోడలిగా అత్తవారింట్లో అడుగు పెట్టాక తొలి ఉషోదయం. గడియారం ఆరున్నర చూపిస్తుంటే ఆదరబాదరగా గదిలోంచి బైటపడ్డాను. హాల్లోనే ఎదురయ్యారు అత్తగారు.**

''లేచావా అమ్మాయ్..టైమెంతయిందో..అబ్బాయింకా మొద్దునిద్ర పోతూనే వున్నాడా?'' ముఖం నిండా నవ్వు పులుముకుంటూ అడిగారు, కానీ ఆ చూపుల్లో ఓ రకమైన భావం నా దృష్టి దాటిపోలేదు. అప్పటికే తలారా స్నానం చేసి, పూజ పూర్తి చేసి వున్నారేమో, మనిషి మాత్రం మహా కళగా కనిపిస్తున్నారు. ఆ మాత్రం క్రమశిక్షణ నాలో కనబడడం లేదనేది ఆమె చూపులకర్థమని తెలుసుకోలేనంత అమాయకురాలినా నేను?

నిజానికి ఐదు గంటలకే లేచి పని పాట్లలో పడటం నాకలవాటే. ఇవాళ కూడా తొందరగానే మెలకువ వచ్చేసింది. ఈ కొత్త మొగుడుగారు (క్షమించాలి. ఎక్కడో భాషా దోషం దొర్లుతున్నట్టుంది. ఒక్కరే భర్త అయినప్పుడు కొత్త, పాత ఏమిటి? ఏదో కొత్తకాపురం గదా ఆయనగారికీ, నాకూ అంత కొత్త కొత్తగా వుందని ఆ మాట వాడానంతే) రాత్రంతా చేసిన ఆగడాలు చాలక, తెల్లవారుఝామున మళ్ళీ మొదలుపెట్టేశారు. నాకూ లోలోపల ఆనందంగానే వున్నా, అత్తగారు గుర్తుకు రాగానే, ఆయనగారిని అతికష్టం మీద ఆపి, బలవంతంగా బైటపడేసరికి ఈ వేళయింది.

అయినా పేద్ద ఆలస్యం ఏమైపోయిందనీ, ఈవిడగారి దీర్ఘాలు కాకపోతే, మా స్నేహితురాళ్ళు సులోచన, రాగిణి అయితే పెళ్ళయిన తర్వాత కూడా ఏనాడూ ఎనిమిదిన్నరకి ముందు లేచిన పాపాన పోలేదు. మా గ్రూప్‌లో నేనేనండోయ్ మహా బుద్ధిమంతురాల్ని. అసలు ఈ రోజుల్లో కూడా నాలాంటి కుదురైన కోడలు దొరకడం మా అత్తగారి అదృష్టం కాక మరేమిటి? కాస్త స్వంత డబ్బా ఎక్కువైపోయినట్టనిపిస్తోందా? సరే..ఆపేస్తాలెండి..నాతో పోల్చుకుని మీక్కూడా ఏ మూలో కుసింత అసూయ కలుగుతున్నట్లుంది.

మా అత్తగారి గురించి సింపుల్‌గా ఒక్కమాటలో చెప్పాలంటే ఛాయదేవికెక్కువ..సూర్యకాంతానికి తక్కువన్నమాట. నోరు పెద్దది కాబట్టి దబాయింపు సెక్షన్‌లో ఇంట్లోనూ, బైట కూడా చెడుగుడు ఆడేస్తుందని అభిజ్ఞ వర్గాల భోగట్టా. పెళ్ళికి ముందే సైలంట్ మనిషో, పెళ్ళయ్యాక మెతక బడిపోయారో తెలీదుగానీ, రెండేళ్ళక్రితం రిటైరైన మామయ్యగారికి పాపం ప్రస్తుతం 'ఇట్లు తమ విధేయుడు' పాత్రే.

ఇక శ్రీవారి గురించి చెప్పాలంటే ఇద్దరు ఆడపిల్లల మధ్యన ఒక్కడే కొడుకు..మా అత్తగారి పంచప్రాణాలు ఈయన మీదే. కొడుకంటే వల్లమాలిన ప్రేమ, అభిమానం..ఈయనమీద ఈగ వాలితే, ఆవిడమీద ఏనుగు పడ్డంత.

ఆర్నెలల క్రితం ఈయనకి జలుబు, రొంప చేసి జ్వరం వచ్చి మూడో రోజయినా తగ్గకపోయేసరికి, ఆ ఏడు కొండలవాడికి నిలువుదోపిడీ యిచ్చుకుంటాననీ మొక్కుకుని, కాలినడకన మెట్లన్నీ ఎక్కి, స్వామిని దర్శించుకుని మరీ వచ్చారట. ఈయనగారు కూడా అమ్మ కూచే...ఆవిడ అంచనాలకి ఏమాత్రం తగ్గరు. కనీసం అలా కనిపించరు.

మొదటిసారి ఈ సంబంధం గురించి నాన్న నాతో ప్రస్తావించినప్పుడు, మా అత్తగారి విషయం కూడా క్షుణ్ణంగా వివరించారు. సరే...సంబంధం కుదిరినప్పుడుగదాని పెళ్ళిచూపులకి కూర్చున్నానుగానీ, పెళ్ళికొడుకుని చూశాక 'ఎటో వెళ్ళిపోయింది మనసు' టైపులో నన్ను నేనే మరచిపోయాను.

మా అత్తగారు నన్ను ఇంటర్వ్యూ చేశారో, ఇంటరాగేట్ చేశారో గ్రహించే లోపలే, ఆమె పరీక్షలో నేను నెగ్గాను. పెళ్ళయిపోయింది ఇక నెగ్గాల్సింది నా కోడరికాన్ని..అత్తగారి ధాష్టీకాని..ఎలాగో..ఏమిటో కాలమే చెప్పాలి.

కాపురంలో మొదటిరోజే, మా అత్తగారి సామ్రాజ్యంలో నేనెంత పిపీలకాన్నో అర్థమయింది. ఏమాత్రం ఛాన్స్ తీసుకోవడం ఆమెకి యిష్టం లేనట్టుంది. ఇన్నాళ్ళుగా తాననుభవిస్తున్న ఏకఛత్రాధిపత్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో వదులుకునే ప్రసక్తే లేదని మొదటిరోజే తెలిసిపోయింది ఆవిడ మాటల్లోనే.

''మీ కొత్త కోడల్ని చూపించవా జగదాంబా'' అంటూ వచ్చారు ఓ అరడజను మంది అమ్మలక్కలు. మా పెళ్ళికి రాలేకపోయిన వీధి ముత్తయిదువలు.

హాల్లో వారిని కూర్చోబెట్టి, నాకోసం కేకేశారు అత్తగారు. నేను వెళ్ళేలోపలే కబుర్లు మొదలైపోయాయి.

''మీ కోడలు పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసిందట గదా!'' ఆరా తీస్తోంది ఒకావిడ.

''అబ్బో..పెద్ద చదువే..ఐదో క్లాసు వరకే చదువుకున్న నీకు అంత పెద్ద చదువున్న కోడలు వచ్చిందంటే, యిక నీకు పెరట్లో మంచం, మంచం కింద కంచమే గతి'' తనేదో జోక్ చేస్తున్నట్టు నటిస్తూనే, పుల్లవిరుపుమాట పడేసింది ఇంకొకావిడ.

మా అత్తగారు మాత్రం దాన్నేమాత్రం జోక్‌గా తీసుకోలేదు. బీపీ బాగా పెరిగిపోయినట్టుంది.

''చదువా చట్టుబండలా..తిక్క తిక్క వేషాలు వేసిందంటే కాళ్ళు విరిచి కావేట్లో పడేస్తాను. ఈ జగదాంబతో పెట్టుకుంటే ఏమవుతుందో క్షణ క్షణం గుర్తొచ్చేలా చేస్తాను'' ఆవిడ ఆవేశంతో రొప్పుతోంది. కోపంతో శరీరం కంపిస్తోంది.

ఆవిడ అంతగా రియాక్ట్ కావలసిన అవసరం ఏమిటో నాకైతే అర్థం కాలేదు గానీ, ఆవిడని ఇరిటేట్ చేస్తే చూడబోయే నరకమేమిటో తెలిసేలా చేసింది. నిజం చెప్పొద్దూ..నాలో మొదటిసారి చిన్న భయం లాంటిది కలిగింది.

అత్తగారి ఆగడాలు, కోడలి అగచాట్లు ఎన్ని కథలుగా రాలేదు. ఎన్ని సినిమాలుగా చూడలేదు. ఎన్ని వాస్తవాలుగా గమనించలేదు.

తనదాకా వస్తేనే తెలుస్తుందన్నది నిజం. నాకిప్పుడు బోధపడింది.

ఆవిడకి నామీద విపరీతమైన అనుమానం. తనని, కొడుకుని దూరం చేయబోతున్నాననే అభద్రతా భావం. ఛాదస్తం, మూర్ఖత్వం సమపాళ్ళలో రంగరించుకున్న మనిషి ఆవిడ.

కాకపోతే ఆమె నాలో సహనాన్నే చూసింది.

మొదటిసారి వంట గదిలో ఆమెకు సాయబడబోతుంటే-

''నువ్వెందుకమ్మాయి..వంట నే చేస్తాగా..నువ్వీ వంటింటి ఛాయలకి కూడా రానవసరం లేదు. లే'' అంటూ ఎంతో ప్రేమ ఒలకబోస్తూనే, అక్కడ తనకి ఎదురులేకుండా చూసుకుంది. ఆ వెనుకే సణుగుడు వినిపిస్తూనే వుంది. ''ఈ కాలం ఆడపిల్లలకి మహా చేతనవుతుందిలే వంట..అది తింటే, ఇహ తిండి మీద యావ చచ్చి అంతా మూలపడాల్సిందే''

నేనూరుకుంటానా?



''ఉదయం నుండి పనీ పాటలతో విశ్రాంతి లేకుండా అలా పరిగెడుతునే వున్నారు గద అత్తయ్యా. ఒక్క పావుగంట అలా రిలాక్సవండి. నేను కాఫీ చేసి పెడతాను'' అన్నాను వీలైనంత మార్దవంగా.

''ముప్ఫై అయిదేళ్ళ నుండీ ఈ చాకిరీ నాకు కొత్త కాదమ్మాయ్ ఈవాళ నువ్వొచ్చావని నేను మూల నేరిపోవడానికి. నా ఒంట్లో యింకా సత్తువ చచ్చిపోలేదు. మరో పదిమంది వున్నా సేవలు చేసిపెట్టగలను'' తర్జనితో విచిత్రంగా బెదిరించారు.

ఓరి భగవంతుడా..ఈవిడ విషయాన్ని ఎట్నుండి ఎటు మలుపులు తిప్పేస్తోందో.

''నా ఉద్దేశ్యం అది కాదత్తయ్యా. ఎంత ప్రాణం లేని యంత్రానికైనా మధ్యలో కొద్దిసేపైనా ఆపి రెస్ట్ యివ్వకపోతే, మొత్తానికే మూలపడే ప్రమాదం వుంది. జీవం వున్న మనిషికి మధ్య మధ్యలో విశ్రాంతి మరీ అవసరం. నేనీ యింటికి వచ్చినప్పటి నుండీ గమనిస్తూనే వున్నాను. ఏభై అయిదేళ్ళ వయసులో కూడా ఉదయం లేచినప్పటి నుండి రాత్రి నిద్రపోయేవరకు ఏదో ఒక ఉపయోగపడే పని అలా చేస్తూనే వుంటారు. అంత డిసిప్లిన్డ్‌గా జీవితాన్ని తీర్చిదిద్దుకున్నారు కాబట్టే మీకది సాధ్యమైంది. మిమ్మల్ని ఆదర్శంగా, మీ పనిని తగ్గించలేకపోయినా, మీతో పాలు పంచుకుంటే అదో ఆనందం మా తరానికి. మీకున్న నేర్పులో వందో వంతు అబ్బినా మేము ఎంతో సాధించినట్టు''

నా పాచిక పారింది. ఆవిడ గొప్పతనం, నా తక్కువతనం కలిసిన నా మాటలు ఆవిడ అహాన్ని కొద్దిగా కదిల్చాయి.

గుడారంలో ఒంటె మూతి పెట్టగలిగింది. వంటింట్లో నా జీవితం కాఫీతో మొదలయింది. అత్తగారు ఫిల్టర్ కాఫీ యిష్టపడతారు.

అద్భుతంగా చేయగలనని చెప్పను గానీ, నేను వంట చేస్తే వంక పెట్టాల్సిన పని లేదు. నా వంటింటి ప్రస్థానం కాఫీ దశ నుండి పండగ పిండి వంటలు చేయడం వరకు సాగింది.

నా వంట అమోఘం అని, మావగారు, ఆయన గారు లొట్టలేసుకు తింటుంటే, ఆవిడ ముఖం మాడ్చుకునేవారు.

''ఇందులో నా గొప్పేం లేదు. ఏది ఎంత పాళ్ళలో వేయాలో అత్తగారు దగ్గరుండి డైరక్షన్ ఇస్తుంటే చేశాన్నేను'' అంటూ ఆవిడని ఆకాశానికెత్తేస్తే, అదే ముఖం మతాబులా వెలిగిపోయేది.

ఏ పని చేసినా తప్పే, చేయకున్నా తప్పే అంటూ ఆవిడ నానా రాద్ధాంతం చేస్తున్నప్పుడు, మావయ్యగారు ఓరోజు నన్ను ఓదార్చబోయారు.

''నాకైతే ఈ జీవితం అలవాటైపోయింది తల్లీ..తప్పదు కూడా. తన అత్త నుండి ఆమె ఎన్నో అగచాట్లు, అవమానాలు పడింది. ఆనాడు అన్నీ ఉమ్మడి కుటుంబాలు కాబట్టి తప్పించుకోలేక లోలోపలే రాక్షసత్వాన్ని పెంచుకుంది. నిన్ను వచ్చినప్పటినుండి గమనిస్తూనే వున్నాను, ఏనాడు అణకువ, సహనం కోల్పోలేదు. కానీ..కొన్నాళ్ళకి నువ్వు మరో జగదాంబగా మారిపోకూడదని నేనీ సలహా యిస్తున్నాను. అబ్బాయితో నేను మాట్లాడతాను. మీరు వేరుగా కాపురం పెట్టేలా నేను చూస్తాను.''

మామయ్యగారు యింకా ఏదో చెప్పబోతుండగా మధ్యలోనే ఆపేశాను. అప్రయత్నంగా నా కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

''నేను కోడలిగా వచ్చింది మీ అబ్బాయి జీవితంలోనూ, మీ హృదయాల్లోనూ స్థానం సంపాదించుకోవడం కోసం. అంతేగానీ, ఓ బిడ్డను తల్లిదండ్రుల నుండి వేరు చేయడానికి కాదు. అత్తగారు నన్ను 'అమ్మాయ్' అంటారు. మీరు 'తల్లీ' అన్నారు. అంటే మీరిద్దరూ నన్ను ఓ బిడ్డగా చూస్తున్నారనే గదా! తల్లీ, తండ్రిలో ఒకరి ప్రవర్తన సరిలేకపోతే, బిడ్డ వదిలేయగలదా! అమ్మలాంటి అత్తగారిని నేను కాదనుకోగలనా'' అంటున్న నన్ను అశ్రుపూరిత నయనాలతో, వాత్సల్యంగా తాకి ఆశీర్వదించారు. ఆయన మంచితనం నా పట్టుదలను ద్విగుణీకృతం చేసింది.

మా అత్తగారికి కావలసింది అధికారం. అహం సంతృప్తి చెందడం..పదే పదే ఆమె పెద్దరికాన్ని, గొప్పతనాన్ని గుర్తుచేయడం ద్వారా నేను తన ముందు ఎన్నటికీ అందుకోలేనంత దూరంలో, దిగువనే వున్నాననే భావన కలిగించాను. ఆమె పుట్టింటి సంగతులు, చిన్ననాటి విశేషాలు ఆసక్తి ప్రదర్శిస్తూ వినడం ద్వారా, నేనూ ఆమె అంతర్ వలయంలోకి చేరుకోగలిగాను. సూటిగా ఆమె చర్యల్ని ఏనాడూ తప్పు పట్టకుండా, వేరే విధంగా చేస్తే ఎలా వుంటుందో నాలుగైదు రకాలుగా ఆమె నోటి వెంటే చెప్పించడం ద్వారా తన చర్యల్ని తనే సమీక్షించుకునే అవకాశం కల్పించాను. మా పుట్టింటి గొప్పలకన్నా, ఆమె విజయ రహస్యాలకే ప్రాధాన్యత యిచ్చాను.

అవును..ఆమె కూడా మనిషే. సంఘంలో సగటు ఆడపిల్లగా ఆంక్షల మాటున అణగిపోయింది. పుట్టి బుద్దెరిగినప్పటి నుండి అనుబంధం పెంచుకున్న తనదనుకున్న కుటుంబాన్ని వదిలి 'అత్తవారిల్లు' అనే కొత్త ప్రపంచలోకి నిర్దాక్షిణ్యంగా విసిరేయబడింది. పరిస్థితులతో రాజీ పడి, కనీసం అలా నటిస్తూ, తన కోసం మరో కుటుంబమనే కోటను నిర్మించుకుంది. ఈ క్రమంలో మనసును రాయిగానూ మార్చుకుంది. మరోసారి ఆ సౌధం తరువాతి తరం కారణంగా బీటలు వారుతుందేమో నన్న భయంతో, అభద్రతతో తనే రాక్షసిగా మారి కాపలా కాయాలనుకుంది.

ఎందరో అత్తగార్లు..కథనాలు వేర్వేరు..కథ ఒక్కటే. వారి బాధలోనూ వాస్తవం వుంది. కాలం మారిందనే సాకుతో, కేవలం తమ స్వార్థం కోసం వేరు కాపురాల పేరుతో కట్టుకున్న వాడ్ని నిర్దాక్షిణ్యంగా తల్లిదండ్రుల నుండి దూరం చేస్తున్న నవతరం నాయికలు తయారయ్యారు. అత్త-కోడలు అనే మాట చాలా స్వల్ప వ్యవధికే పరిమితమైపోతోంది.

అదృష్టవశాత్తూ నన్ను కన్నవాళ్ళు నాలో సంస్కారాన్నీ ఇచ్చారు. అదే ఆయుధమై మా అత్తగార్ని నాకు దగ్గర చేసింది. ఏడాది తిరిగేసరి కల్లా..

ఆమె నాకు అత్తగారే కాదు అనురాగం పంచే అమ్మ కూడా యిప్పుడు.

మాటల్లో పడి మరచిపోయాను. ఈవాళ చాలా పనులున్నాయి...ఉదయం అత్తగారిని కంటి చెకప్‌కి తీసుకెళ్ళాలి, మధ్యాహ్నం టీవీలో యిద్దరం కలిసి మల్లీశ్వరి సినిమా చూడాలి. సాయంత్రం రాజ్యలక్ష్మిగారమ్మాయి సీమంతానికి వెళ్ళాలి, రాత్రి పదిగంటల రైల్లో మా చిన్నాడపడుచు వస్తోంది. రిసీవింగ్‌కి వెళ్ళాలి. ఇంకో విషయం..ఈ ఏడాది ఆవకాయ నేనే పెట్టాలి. (అఫ్‌కోర్స్ అత్తగారి డైరక్షన్‌లో. ఏంటీ? నాకు ఆవకాయ పెట్టడం వచ్చని మీకు తెలుసా! ష్..ష్..ఆవిడ వింటారు..గట్టిగా అనకండి)..ఇంకా బాబోయ్..ఇక చాలు అత్తగారి కబుర్లు అంటున్నారా..సర్లెండి..మరోసారి చెప్పుకుందాం..ఈసారి మీ విజయ గాథలు వినడానికి నేను రెడీ..

## సినిమాల్లేవ్ కదా అని...

**కష్టకాలంలోనో, మనసు బాగాలేనప్పుడో దైవం గుర్తుకొస్తూ ఉంటుందేమో. ఇప్పుడు రవళి సంగతి తీసుకుంటే ఈ విషయం నిర్ధారణ అవుతుంది. సినిమాలు ఎలాగూ లేవు కదా అని రవళి ఇప్పుడు దైవభక్తిని పెంచుకుంటున్నట్టుంది. అందుకేనేమో తెలంగాణ ప్రజలు ఎంతో భక్తిశ్రద్ధలతో పూజించే మహంకాళి జాతరలో ఆమె పాల్గొంది. పాతబస్తీలో జరిగిన బోనాల వేడుకల్లో సంప్రదాయబద్ధంగా అలంకరించుకుని బోనాలు ఎత్తుకుని అమ్మవారిని దర్శించుకుంది.**

